

జంగారెడ్డిగూడెంలో సినీ నటుడు సుమన్ సందడి

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సినీ నటుడు సుమన్ శనివారం సందడి చేశారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిర్మిస్తున్న సినిమా షూటింగ్‌కి సుమన్ వచ్చారు. ఈ క్రమంలో పలువురు సుమన్‌ని కలిశారు. అలాగే జంగారెడ్డిగూడెం విచ్చేసిన సుమన్‌ను పలువురు అభిమానులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు, పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ పాల్గొన్నారు.



సుమన్‌ను సన్మానిస్తున్న అభిమానులు

కౌలు రైతులపై

కనికరం లేదాయే..!

కౌలుకార్డుల జారీ ప్రక్రియలో తీవ్ర నిర్లక్ష్యం

ప్రచారం, గ్రామసభలు అన్నింటికీ తిలోదకాలు

నోరుమెదపని వ్యవసాయశాఖ జిల్లా అధికారులు

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు

భూయజమాని అంగీకారం నిబంధన పేరుతో కొర్రీలు

ప్రభుత్వం, అధికారుల తీరుపై అన్నదాత ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల బాగోగులు చూడాల్సిన వ్యవసాయశాఖ మొద్దునిద్రలో జోగుతోంది. రైతుల గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో వ్యవసాయసాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఖరీఫ్ సాగు ఆరంభమవుతున్నా ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ తూతూమంత్రంగా అన్నట్లు తయారైంది. భూయజమాని అంగీకారం ముసుగులో కౌలురైతుల బతుకులకు కొర్రీలు వేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది.

రైతే దేశానికి వెన్నెముక.. మాది రైతు ప్రభుత్వం అంటూ ఊదరగొడుతున్న పాలకులు రైతుల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. రైతుల బాగోగులు చూడాల్సిన వ్యవసాయశాఖ అధికారులు ఎసి గదులకు పరిమితమవుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం జిల్లాలోని కౌలురైతులకు పెనుశాపంగా మారింది. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో వ్యవసాయ సాగు 70 శాతానికిపైగా కౌలురైతులే చేస్తున్నారు. ప్రతియేటా ఏప్రిల్ రెండో వారంలో కౌలుకార్డులు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ ప్రారంభించేవారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం, గ్రామసభలు పెట్టి రైతులకు అవగాహన కల్పించడం వంటి చర్యలను వ్యవసాయ, రెవెన్యూశాఖలు చేపట్టేవి. ఈ ఏడాది కౌలుకార్డుల ప్రక్రియను తూతూమంత్రం అన్నట్లు తయారైంది. కౌలుకార్డుల ప్రక్రియపై ఇప్పటి వరకూ వ్యవసాయశాఖ జిల్లా అధికారులు నోరుమెదపని పరిస్థితి ఉంది. గతంలో కౌలుకార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసినప్పుడు, రైతులకు అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగా మీడియాకు వివరాలిచ్చేవారు. కౌలుకార్డుల ప్రక్రియపై ఏం జరుగుతుందో, ఇప్పటి వరకూ ఎన్ని కౌలుకార్డులు జారీచేశారు, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వంటి వివరాలేవీ మీడియాకు చెప్పని పరిస్థితి నెలకొంది. తమ అలసత్వం బయటపడుతుందనే ఆలోచనతో మీడియాకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. ఒకవేళ ఫోన్ చేసినా సమాధానం చెప్పే పరిస్థితి ముఖ్యంగా ఏలూరు జిల్లాలో లేకుండాపోయింది. జిల్లా వ్యవసాయ శాఖాధికారులు తమకు రైతులతో ఏమాత్రం సంబంధం లేదన్నట్లు, నియంతల మాదిరిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖాధికారులే రైతుల గురించి ఆలోచించకపోతే ఇక అన్నదాత పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. ఇప్పటి వరకూ పదిశాతం మాత్రమే కౌలుకార్డుల జారీ జరిగినట్లు తెలుస్తోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ వేగవంతంపై జిల్లా కలెక్టర్లు చొరవ చూపకపోతే అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

భూయజమాని అంగీకారం ముసుగులో కొర్రీలు

వైసిపి ప్రభుత్వం వచ్చాక 2019 భూసాగుదారు హక్కుచట్టం పేరుతో 2011లో వచ్చిన కౌలురైతుల చట్టంలో మార్పులు చేసింది. భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలని నిబంధన విధించింది. భూయజమానులకు వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు అవగాహన కల్పించి కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేస్తారని పేర్కొంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. భూయజమాని అంగీకరించడం లేదనే కారణంతో కౌలురైతులకు కార్డులు ఇవ్వడం లేదు. దీంతో పంట నష్టపరిహారం, బీమా, రైతుభరోసా వంటి ఏఒక్క ప్రభుత్వ సాయం కౌలురైతులకు అందడం లేదు. భూయజమానులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తెచ్చిన భూయజమాని అంగీకారం నిబంధన కౌలురైతులకు ఉరితాడు మాదిరిగా తయారైంది. జారీ చేస్తున్న కౌలుకార్డుల్లో చాలావరకూ బోగస్ అంటూ విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. భూయజమాని బంధువులకు కార్డులు జారీ చేసి లెక్కలు చూపిస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇప్పటికైనా కౌలురైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుసంఘాలు కోరుతున్నాయి.



భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులివ్వాలి

ఎ.హరేరాం, ఎపి రైతుసంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

గ్రామసభలు నిర్వహించాలి. విఆర్‌ఒ, వ్యవసాయాధికారి, వాలంటీర్లతో పరిశీలన చేసి అర్హులైన కౌలురైతులందరికీ భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేయాలి. ఓటుహక్కు మాదిరిగా అర్హులైన ప్రతి కౌలురైతుకూ కౌలుకార్డు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. పంట రుణం, పంట నష్టపరిహారం, బీమా వంటివి కౌలురైతులు పొందేవిధంగా కౌలుకార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలి.

ఉద్రిక్తంగా టిడిపి నేతల 'పోలవరం' పర్యటన

పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలింపు

జగన్‌కు ఓటమి భయం : దేవినేని

ప్రజాశక్తి - పోలవరం/బుట్టాయగూడెం

టిడిపి నేతల పోలవరం ప్రాజెక్టు సందర్శన ఉద్రిక్తంగా మారింది. సందర్శనకు వెళ్తున్న మాజీ మంత్రులు, టిడిపి నేతలు దేవినేని ఉమా మహేశ్వరరావు, కెఎస్.జవహర్, పోలవరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌ను ప్రాజెక్టు చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు వివిధ కార్లలో శనివారం ఉదయం బయలుదేరారు. ప్రాజెక్టు సమీపంలో కార్లు రోడ్డు పక్కన నిలిపివేసి పాదయాత్రగా బయలుదేరారు. వీరిలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ద్విచక్ర వాహనంపై ముందు బయలుదేరారు. ఆయన వెనుక ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రదర్శనగా వెళ్తున్న క్రమంలో చెక్‌పోస్టు వద్దకు రాగానే పోలీసులు వీరిని అడ్డుకున్నారు. తామంతా ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్తున్నామని, దీన్ని రాజకీయం చేయొద్దంటూ పోలీసులను కోరారు. ప్రాజెక్టు సందర్శనకు ప్రభుత్వ అనుమతి లేదంటూ వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణవాతావరణం తలెత్తింది. దీంతో పోలీసులు నేతలను బలవంతంగా పోలీస్ వ్యాన్లలో ఎక్కించుకుని బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం ఆరు గంటల సమయంలో వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద ఉమామహేశ్వరరావు, జవహర్, బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. తమ హయాంలో పోలవరం సందర్శనకు ప్రజలను, రైతులను కొన్ని వందల బస్సుల్లో తీసుకెళ్లి ప్రాజెక్టును చూపించామని, కానీ జగన్‌కు ఆ దమ్ము లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులను, మీడియాను, ప్రజలను, ప్రతిపక్ష నేతలను ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సిఎం జగన్ పోలవరం ప్రాజెక్టును నాశనం చేస్తున్నారని విమర్శించారు. తమ హయాంలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయినప్పటికీ, వైసిపి అధికారంలోకి రాగానే ఆ పనులను నిర్దాక్షిణ్యంగా నిలిపివేసి, రివర్స్ టెండరింగ్ అంటూ డ్రామాలు ఆడారని తెలిపారు. పనులు శరవేగంగా చేపడుతున్న నవయుగ కంపెనీని వెళ్లగొట్టి రివర్స్ టెండరింగ్ పేరుతో వెయ్యి కోట్లు పక్కదారి పట్టించారన్నారు. డయాఫ్రం వాల్ పోయిందని, దీనికి టిడిపి ప్రభుత్వమే కారణమంటూ ఆరోపణలు చేయడం జగన్‌కు తగదన్నారు. ప్రాజెక్టు డిజైన్ రివ్యూ ఛానల్ ఇచ్చిన సలహా మేరకు కొంతమేర సరిదిద్దుకుంటే సరిపోతుందని, కానీ లోవర్ కాపర్ డ్యాం ఎత్తు పెంచకపోవడంతో గోదావరి నీరు ధవళేశ్వరం ఆనకట్టకు వెళ్లకుండా లోయర్ కాపర్ డ్యాం డయాఫ్రం వాల్ అప్పర్ కాపర్ డ్యాం మధ్యలో ఆగిపోయిందన్నారు. ఇలాంటి విషయాలను తాము ఎక్కడ బయటపెడతావోనని మీడియాను ప్రాజెక్టు నిర్మాణం జరిగే ప్రదేశానికి అనుమతించడం లేదన్నారు. హెలికాప్టర్ విజిట్, డ్రోన్ విజిట్, ఏరియల్ సర్వే అంటూ వేలకోట్ల రూపాయలు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. 'పోలవరం' పనులు నిర్లక్ష్యం చేస్తూ రైతులకు, నిర్వాసితులకు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. లిక్కర్, ఇసుక, ల్యాండ్ మాఫియాలో మునిగితేలుతున్న వైసిపి ప్రభుత్వం 'పోలవరం' నిధులను కూడా పక్కదారి పట్టించాలని చూడటం అన్యాయమని వారు విమర్శించారు. ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి తమ ప్రభుత్వ హయాంలో టిడిపి అధినేత చంద్రబాబు 82సార్లు ప్రతీ సోమవారం 'పోలవరం' సమీక్షకు వచ్చేవారని గుర్తు చేశారు. ప్రస్తుత సిఎంఎ జగన్ తన నాలుగేళ్ల పాలనలో నాలుగుసార్లు మాత్రమే ప్రాజెక్టును పరిశీలించారని విమర్శించారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఘోరంగా మోసం చేశారన్నారు. వారికి పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండా గ్రామాలను ఖాళీ చేయించారని, నిర్వాసిత కాలనీల్లో కనీస వసతుల్లేక వారు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల ఉసురుతో ఈ ప్రభుత్వం గోదావరిలో కలిసిపోతుందన్నారు.



పోలీస్ స్టేషన్‌లో టిడిపి నేతలు



నేతల అరెస్టుకు నిరసనగా ఆందోళన చేస్తున్న నాయకులు

అక్రమ అరెస్టులకు టిడిపి నేతల నిరసన

టిడిపి నేతల అక్రమ అరెస్టులను నిరసిస్తూ పోలవరం నియోజకవర్గంలోని నాయకులు, కార్యర్తలు బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌కు చేరుకు ఆందోళన చేపట్టారు. మండుటెండలో స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారేపల్లి రామారావు, యంద్రప్రగడ శ్రీనివాసరావు, ముఘపర్తి సొంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలురైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలే కారణం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

జిల్లాలో కౌలు రైతుల రాష్ట్ర ప్రచార జాతా

కౌలు రైతుల చట్టాన్ని సవరించాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్లనే కౌలు రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కౌలురైతుల చట్టాన్ని సవరించి భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రచార జాతా శనివారం ఏలూరు చేరుకుంది. స్థానిక వసంత మహల్ సెంటర్ వద్ద ఈ జాతాకు రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. కౌలు రైతులకు రక్షణ కల్పించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ సాగుభూమిలో 70 శాతం భూమిని సాగు చేస్తూ పంటలు పండిస్తున్నది కౌలు రైతులేనని చెప్పారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వీరి రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోగా కౌలు రైతులకు నష్టం కలిగించే విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. గత కౌలు రైతుల చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం రద్దుచేసి 2019 పంట సాగుదారు హక్కు చట్టం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. ఈనెల 12న విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుండి మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయం వరకు జరుగుతున్న కౌలు రైతుల రాయబార కార్యక్రమ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో కష్టపడుతున్న కౌలు రైతులు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పెరిగిన పెట్టుబడులు రీత్యా రైతు భరోసా పెట్టుబడి సాయం రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణ కోసం జరుగుతున్న ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగులూరి జాన్‌బాబు, ఆటో ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బుద్ధా నాగసూరిబాబు, జిల్లా కార్యదర్శి ఎ.గోపి, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు కనకారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కో-కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి, వెంకటరామరాజు పాల్గొన్నారు.

నిడమర్రు: కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా మండలంలోని భువనపల్లి, నిడమర్రు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 పంట సాగుదారు హక్కు చట్టం వల్ల కౌలురైతులకు పెద్దగా ప్రయోజనం లేదన్నారు. భూయజమాని అంగీకారంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమన్నారు. గ్రామ సచివాలయ, రైతు భరోసా సిబ్బంది ఆధారంగా గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి భూ యజమానుల సంతకాలతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డు మంజూరు చేయాలని కోరారు. పంట నష్టపరిహారాలు కౌలు రైతులకే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లికోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, గవర సత్యనారాయణ, కనకరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

భీమడోలు: ఉద్యమాల ద్వారానే కౌలు రైతుల రక్షణ సాధ్యమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఎపి కౌలు రైతు సంఘం చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా భీమడోలు మండలంలో శనివారం సాగింది. దీనిలో భాగంగా పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు, గుండుగొలను గ్రామాల మీదుగా కొనసాగిన యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లో కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, కౌలు రైతుల సంఘ నాయకులు కె.అప్పారావు, వి.శ్రీరామచంద్రమూర్తి, జికృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

ఉంగుటూరు: వ్యవసాయంలో కష్టపడి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. కౌలు రైతుల సంఘం చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా ఉంగుటూరు మండలంలోని నారాయణపురం, చేబ్రోలు, కైకరం గ్రామాల గుండా సాగింది. ఆయా గ్రామాలలో జరిగిన సభల్లో సూర్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, ఇందుకూరి వెంకటరామరాజు పాల్గొన్నారు.



ఏలూరులో..



నిడమర్రులో..

'పోలవరం' పనులకు అటంకం కలిగిస్తారనే అరెస్టు : తెల్లం

పోలవరం: చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి నేడు సందర్శనకు టిడిపి నేతలు రావడం విడ్డూరంగా ఉందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు విమర్శించారు. వీరు పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగిస్తారనే ఉద్దేశంతోనే పోలీసులు వీరిని అడ్డగించి అరెస్టు చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అశాంతిని నెలకొల్పడానికి, ప్రజలను రెచ్చగొట్టడానికి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో చేయలేని పనులను సిఎం జగన్ చేయడం వల్లే ప్రజల అభినందనలు, మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. టిడిపి హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి వినియోగించాల్సిన నిధులను ఎటిఎం మాదిరి వాడుకున్నారని, సాక్షాత్తు దేశ ప్రధాని అన్నారని గుర్తు చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పోలవరం ప్రాజెక్టులో డబ్బులు దండుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టు కోసం కానీ, నిర్వాసితుల కోసం కానీ ఏమీ చేయలేదన్నారు. అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించి, అవసరమైతే చంద్రబాబును అరెస్టు చేయడం జరుగుతుందని ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైడ్ బండ్ స్వల్పంగా కుంగడం వంటి చిన్న సమస్యను భూతద్దంలో చూపించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా నిర్వాసితుల కష్టాలను, బాధలను పట్టించుకోలేదన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

గోదావరి వరదల ఆధారంగా పరిహారమివ్వాలి

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం 'పోరుకేక'ను విజయవంతం చేయాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

కుక్కునూరు: 1986, 2022లో వచ్చిన గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకుని కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రతినిర్వాసితుడికీ పూర్తి పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న వారికి పూర్తి స్థాయిలోపరిహారం, పునరావాసం చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో వెయ్యి మందితో ఈ నెల 20న అల్లూరి జిల్లా నెల్లిపాకలో పాదయాత్ర ప్రారంభించి వచ్చేనెల ఏడో తేదీ వరకూ 400 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ రాష్ట్ర రాజధాని అమరావతిలో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొంటారని ముగింపు సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే ప్రాజెక్టు కోసం నిర్వాసితులు సర్వం త్యాగం చేస్తుంటే వారికి పరిహారం, పునరావసం కల్పించకుండా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కమిటీ సభ్యులు కిషోర్, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, జీవరత్నం, నాయకులు మడివి దుర్గారావు, వెంకట్రావు, మహబూబ్ పాషా పాల్గొన్నారు.


వైసిపి అసమర్థత వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు : టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ అసమర్థత కారణంగా కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి చంటి ఆరోపించారు. ఏలూరులోని ఆయన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజ్ కారణంగా చేనేత కార్మికులు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన జగన్ ఆ హామీని అమలుచేయడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు.

జంగారెడ్డిగూడెం: నిరంతర విద్యుత్ సరఫరాలో మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను చీకటి ఆంధ్రాగా మార్పు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు. శనివారం పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ అధ్యక్షతన పంగిడిగూడెం పార్టీ అధ్యక్షుడు లింగాల సత్యనారాయణ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దొరికినా.. దొరలే..!



'దొరికితేనే దొంగలు.. దొరక్కపోతే దొరలే' అనే చందానికి ప్రస్తుత కాలం చెల్లింది. అదేమిటీ అర్థం మారిందా అనుకుంటే తప్పులో కాలేసినట్లే. మన రాష్ట్రంలో పాలకులు, అధికార పక్ష నేతలే దాని అర్థం మార్చేశారు. దొరక్కపోతేనే కాదు.. దొరికినా తాము దొరలమేనని బాహటంగా మాట్లాడటమే కాకుండా చేతల్లో సైతం చూపుతున్నారు. దీనికి నిదర్శనం పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడలోని గోదావరి పెరుగులంక భూముల నుంచి మట్టి తవ్వకాలే. ఏనుగువానిలంక, చించినాడ రెవెన్యూ పరిధిలోని గోదావరి లంక భూముల్లో పేదలు సాగు చేసుకుంటుండగా నాడు ప్రభుత్వం వారికి పట్టాలిచ్చింది. వాటిని పేదలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. తర్వాత కాలంలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు ఒక్కోసారి పైనుంచి వచ్చిన మట్టి లంకలను ఆనుకుని ఉండటంతో లంకలు విస్తరించడం సహజం. ఇది ప్రకృతి సిద్ధంగా చూసినా లంక భూములు కోతకు గురికాకుండా కొత్తగా ఏర్పడిన పెరుగులంకలు కాపాడుతుంటాయి. ఇవే లేకపోతే లంక భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఆ పెరుగులంక భూములను సైతం పేదలు బాగు చేసి సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ భూములపై అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కన్ను పడింది. దీంతో ఆ భూముల్లో మట్టి తవ్వకానికి వ్యూహాలు రచించి అధికారులను రంగంలోకి దించారు. నరసాపురం నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్ల పూడికకు మట్టి తోలకం పేరుతో తవ్వకాలు ప్రారంభించారు. ఇదేమిటీ..ఈ భూములను తాము సాగు చేసుకుంటున్నాం కదా అని పేదలు మండల, జిల్లాస్థాయి అధికారులను సైతం కలిసి వినతిపత్రాలు అందించారు. వివిధ రూపాల్లో ఆందోళనలు సైతం చేశారు. అయినా కదలిక లేని పెద్దలు తమ తవ్వకాల జోరు మాత్రం కొనసాగించారు. దీంతో కోర్టును ఆశ్రయించగా లంకల్లో తవ్వకాలను ఆపాలని స్టే సైతం ఇచ్చింది. అధికారపక్షమే అండగా ఉండగా తమకేమిటీ అనుకున్నారో.. లేదా తాము చెప్పిందే చట్టం.. కోర్టులేం చేస్తాయని అనుకున్నారో అధికారుల పర్యవేక్షణలో తవ్వకాలు మాత్రం ఆగలేదు. ఈ దశలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని సందర్శించి పోలీసులను, యంత్రాల సిబ్బందిని గట్టిగా హెచ్చరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు పట్టుదలకు పోయి అధికారులపై ఒత్తిడి తెచ్చి మళ్లీ తవ్వకాలను ప్రారంభించారు. అడ్డుకోబోయిన సిపిఎం నేతలు, పేదలను అరెస్టు చేసి సుదూర ప్రాంత పోలీసు స్టేషన్లకు తరలించి తర్వాత విడిచిపెట్టారు. అయినా తవ్వకాలు ఆపకపోవడంతో పేదలు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన రంగప్రవేశం చేయడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి గణపవరం పోలీసు స్టేషన్‌కు తరలించడం, ఈ సందర్భంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోబోయిన సిపిఎం నేతలు, పేదలపై పోలీసులు విచక్షణారహితంగా లారీలు ఝుళిపించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అవి ప్రభుత్వ భూములని, సర్వే నెంబర్లు లేవని పొంతన లేకుండా మాట్లాడి మట్టిపై వచ్చే ఆదాయంపై అవగాహన తప్ప సమస్యపై లేదని చెప్పకనే చెప్పారు. పేదల ఇళ్లకు మట్టి తరలిస్తుంటే అమ్ముకుంటున్నారు, వ్యాపారం చేస్తున్నారు అంటారా అని మరో ప్రజాప్రతినిధి సైతం బీరాలు పలికారు. అయితే శుక్రవారం మేడపాడులో అసలు విషయం బట్టబయలైంది. ఇటుకబట్టీలకు ఒక్కో లారీ మట్టి రూ.పది వేలకు అమ్ముకుంటున్నారంటే వైసిపి నేతల మట్టి దందా ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై అధికారులు సైతం ఏం చేయాలో అర్థం కాక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తవ్వకాలను ఆపేందుకు కృషి చేస్తామని, పట్టాలు సైతం ఇచ్చేందుకు ప్రయత్నిస్తామంటూ ఉపశమన మాటలు చెప్పి పేదలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అదెంత వరకూ కార్యరూపం దాల్చుతుందో దొరల పాలనలో సందేహాస్పదమే. అయితే ఆ లారీని ఎంఎల్ఎ రామానాయుడే పెట్టి ఉండొచ్చంటూ మంత్రి కారుమూరి వ్యాఖ్యలు విస్మయం కల్గిస్తున్నాయి. పైగా అక్కడేం జరిగిందో నీకు.. నాకు తెలియదుగా అని విలేకరులను ప్రశ్నించడం గమనార్హం. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. అక్కడేం జరిగిందో తెలియని వారు దానిపై మాట్లాడేందుకు ఎలా అర్హులవుతారు. అదీ ఒక మంత్రి తెలియకుండా వ్యాఖ్యానించడమంటే ప్రభుత్వ పరువు బజారున పడినట్లేగా. చించినాడలో మట్టి తవ్వకాలపై మొన్న ఎంఎల్‌సి, నిన్న మంత్రి వ్యాఖ్యలు అధికార పార్టీ పరువును బజారున పడేశాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

చించినాడలో పెరుగులంక భూములు ఉన్నది కేవలం 15 ఎకరాలే. చించినాడ ఎగువన గోదావరి పరివాహక ప్రాంతంలో పెరుగులంక భూములు పెద్దసంఖ్యలో పెద్దల అధీనంలో ఉన్నాయి. పేదల మీద నిజంగా ప్రేమ ఉంటే ఇక్కడ పేదలను ఇబ్బంది పెట్టకుండా పెద్దల అధీనంలో ఉన్న భూముల్లో మట్టిని తవ్వి జగనన్న ఇళ్లకు చేరవేస్తే ప్రతిఒక్కరూ అభినందిస్తారు. అలాకాకుండా చించినాడలోనే తవ్వకాలంటే పేదలపై ఈ ప్రభుత్వానికి కక్ష తప్ప.. కారుణ్యం లేదని స్పష్టమవుతోంది. మరోపక్క పర్యావరణానికి విఘాతం కల్గించేలా, వరదలు ముంచెత్తేలా తవ్వకాలు సాగించకూడదు. ఏటిగట్టుకు రక్షణ కల్పిస్తూ లంక భూములు కోతకు గురికాకుండా కాపాడే పెరుగులంక భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉందనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. గోదావరి ఉధృతికి నరసాపురంలో గట్టు కోతకు గురై పట్టణాన్ని వరద ముంచెత్తే పరిస్థితి గత సంవత్సరం ప్రత్యక్షంగా అంతా చూశాం. దీనిలో ఈ ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు సైతం ఉన్నారు. ఇప్పుడు చించినాడ పెరుగులంక సైతం కోత బారిన పడుతోంది. ఈ క్రమంలో మట్టి తవ్వకాలతో అది మరింత ఉధృతమై పెనుప్రమాదమే పొంచి ఉంది. రాజకీయ కారణాలు, సంపాదన పక్కన పెట్టి ప్రభుత్వ పెద్దలు, పర్యావరణం, చట్టం, పేదలు అనే కోణంలో జిల్లా అధికారులు ఆలోచన చేసి ఇప్పటికైనా మట్టి తవ్వకాలను ఆపితే తాము బాధ్యతలు తీసుకున్నప్పుడు చేసిన ప్రమాణాలకు విలువ ఉంటుంది. లేనిపక్షంలో ఇప్పటికే ఎంఎల్‌సి, మంత్రి వ్యాఖ్యలు, మేడపాడు ఘటనతో పోయిన పరువుతోపాటు రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వ పెద్దలకు బుద్ధి చెప్పి, ఆపై వారికి వత్తాసు పలికిన వారికి అక్షింతలు వేయిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్


ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎవిఆర్ మోహన్

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత : ఎవిఆర్ మోహన్

ప్రజాశక్తి – చింతలపూడి

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా డిసిహెచ్ఎస్ ఎవిఆర్.మోహన్ అన్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా ఆసుపత్రిలో జనరేటర్ పనిచేయడం లేదని, కరెంట్ సప్లై లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఎస్ఇ, డిఇ అంబేద్కర్తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవిఆర్ మోహన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సాంకేతిక లోపం ఏర్పడడం వల్ల జనరేటర్ పనిచేయడంలేదని, వెంటనే దానిని పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సుపరింటెండెంట్ సయ్యద్సలాల్, ఏఇ వెంకన్నబాబు, డిప్యూటీ తహశీల్దార్ షకీలా పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో రోగులు, ఆసుపత్రి యాజమాన్యం

శ్రీకృష్ణ హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి – ఏలూరు

స్థానిక ఆర్ఆర్.పేటలోని ఆంధ్ర హాస్పిటల్ రోడ్డులో విజయవార్ ఎదురుగా శ్రీకృష్ణ హాస్పిటల్లో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, శ్రీకృష్ణ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి క్లబ్ అధ్యక్షులు లయన్ టి.అబ్రహంలింకన్ అధ్యక్షత వహించగా డాక్టర్ బి.కృష్ణ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జిల్లా లయన్స్ నాయకులు లేళ్ల వెంకటేశ్వరరావు, విజిఎంఎఆర్ కృష్ణారావు, ప్రగ్రహపతి మురళీకృష్ణ, కార్యదర్శి మారగాని శ్రీనివాసరావు, కోశాధికారి షేక్ ముస్తఫా ఆలీ, సర్వీస్ చైర్పర్సన్ పి.శివకుమార్, డాక్టర్ అఖిల్, మార్కెటింగ్ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 117 మందికి పరీక్షలు చేసి ఎక్స్రే, బోన్ స్కానింగ్, రక్త పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో ఉమ్ములు, కీళ్ళు, నరములు, వెన్నెముక, బోన్ స్కానింగ్, శస్త్రచికిత్స వైద్యంలో గత పదేళ్ల అనుభవం ఉన్న లయన్ డాక్టర్ బి.కృష్ణ బృందంతో ప్రతి నెల రెండో శనివారం ఉచితంగా ఓపి, రక్తపరీక్షలు, ఎక్స్రే, బోన్ స్కానింగ్ తదితర పరీక్షలు చేస్తున్నారు. డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో వైద్యం చేస్తున్నామని, ఏలూరు, పరిసర గ్రామాల ప్రజలు తమ సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రతి నెల ఒక ఆదివారం గ్రామీణ ప్రాంతంలో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసే చోట కూడా తమ బృందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు. క్లబ్ అధ్యక్షులు లయన్ టి.అబ్రహంలింకన్, జిల్లా నాయకులు లయన్ లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అందరూ మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ మజ్జిగ పాకెట్ ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు అందించారు.

సెల్ఫోన్ షాపునకు రూ.27,896 కరెంట్ బిల్లు

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

సెల్ఫోన్ షాపునకు కరెంట్ బిల్లు రూ.27,896 రావడంతో యజమాని జి.ఉమామహేశ్వరరావు షాక్కు గురయ్యారు. మూడేళ్ల నుంచి షాపును నిర్వహిస్తున్నానని, ప్రతి నెల రూ.1500 నుంచి రూ.2000 లోపు కరెంట్ బిల్లు వస్తుందని చెప్పారు. ప్రతి నెలా బిల్లు చెల్లిస్తున్నా ఈ నెల 405 యూనిట్లు వాడినట్టు చూపుతూ దాని నిమిత్తం రూ.4721, పాత బకాయి రూ.23,175 మొత్తం 27,896 వచ్చిందని తెలిపారు. దీనిపై అధికారులను అడిగితే 2014 నుంచి బకాయి ఉందని, బిల్లు మొత్తం తగ్గించడానికి లేదని, వాయిదా పద్ధతిలో కట్టుకోవచ్చని సూచించినట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్కు సత్కారం

ప్రజాశక్తి – ఆగిరిపల్లి

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లి పోలీస్స్టేషన్లో గత ఐదు సంవత్సరాలపైబడి కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు రూరల్ పోలీస్స్టేషన్కు బదిలీ అయిన వాసుదేవరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తబ్రేజ్ నాయక్, పోలీస్సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పట్టణ అధ్యక్షుడు రాముకు పితృవియోగం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

వైసిపి నూజివీడు పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సీలం రాము తండ్రి శీలం వెంకటేశ్వరరావు (68) అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. గత రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో విజయవాడ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం మృతి చెందినట్లు రాము తెలిపారు. పట్టణంలోని ప్రముఖులు వెంకటేశ్వరరావు మృతికి సంతాపం తెలిపారు.

జెఎసిగా సొసైటీ ఉద్యోగులు

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల సహకార ఉద్యోగుల సంఘాలుగా కలిసి ఈ నెల 5న విజయవాడలో జెఎసిగా ఏర్పాటైనట్లు రాష్ట్ర సొసైటీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీలం నాగేశ్వరరావు శనివారం తెలిపారు. సహకార ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల పరిష్కారంపై జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 12న తేదీన ప్రిన్సిపల్ సెక్రటరీని కలవనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించడమే జెఎసి లక్ష్యమని తెలిపారు.

నేరాలు – ఘోరాలు

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

ప్రజాశక్తి – చింతలపూడి

బైక్పై పెళ్లి కార్డులు పంచుతుండగా ఆటో ఢీకొని యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని యర్రంపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి మండలంలోని తెలగావారిగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్కి జూన్ 12వ తేదీ సోమవారం వివాహం జరగనుంది. ఈ క్రమంలో తన బంధువులందరికీ ఆహ్వాన పత్రికలు అందిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం యర్రంపల్లి గ్రామంలో తన మేనత్తకు కార్డు ఇచ్చి తిరిగి బైక్పై వస్తుండగా మార్గమధ్యలో ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇది గమనించిన స్థానికులు ప్రసాద్ను 108లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇకపై గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

దుద్దేపూడి గ్రామస్తులకు పత్రాలను అందించిన సిబ్బంది

ప్రజాశక్తి – భీమడోలు

భూముల రిజిస్ట్రేషన్లో దళారుల ప్రమేయం ఉండదు. స్టాంప్ పేపర్ల మతలబులకు అవకాశం లేదు. రిజిస్ట్రేషన్ కోసం అమ్మకం, కొనుగోలుదారులు దూరప్రాంతాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత సంబంధిత పత్రం కోసం రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు వాటిని అందిస్తున్నారు. ఈ పనులన్నీ గ్రామస్తులకు గ్రామ సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దుద్దేపూడి గ్రామ సచివాలయ కార్యదర్శి వెజ్జు ధర్మారావు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో గ్రామ సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని తొలిసారిగా దుద్దేపూడి గ్రామ సచివాలయం చేపట్టింది. ఈ మేరకు సంబంధిత పత్రాలను లబ్ధిదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది అందించారు. ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సమగ్ర భూరక్ష–భూహక్కు కార్యక్రమంతో పాటు ఇళ్ల స్థలాలు ఇతర ఆస్తుల వివరాలు ఖరారు చేసేందుకు స్వమిత్వ కార్యక్రమాలు సర్వే కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం దుద్దేపూడి సచివాలయ పరిధిలోని కోడూరుపాడును పైలెట్ గ్రామంగా ఎంపిక చేసింది. కార్యక్రమంలో భాగంగా డ్రోన్ సర్వే నిర్వహించారు. సచివాలయ పరిధిలోని కోడూరుపాడు గ్రామంలో 1108 ఎకరాలు రైతుల వద్ద ఉన్న రికార్డులు ఉన్నట్లు సర్వేకు ముందు లెక్క కట్టారు. కానీ సమగ్ర సర్వే ద్వారా 1,100 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. దీంతో రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖలో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల అంగీకారం మేరకు వివాదాలను పరిష్కరించి, డ్రోన్ సర్వే ద్వారా ఖరారు చేసిన 1100 ఎకరాలకు వివరాలు గ్రామసభ ద్వారా ఆమోదం పొందారు. గ్రామ పరిధిలో 725 ఇళ్ల సర్వేలను స్వమిత్వ సర్వే కింద పూర్తి చేసి వాటి వివరాలు సైతం లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను గ్రామ సచివాలయాల ద్వారా చేపట్టేందుకు అనుమతించింది. దీనికి అవసరమైన ఫీజులు, స్టాంపులు, రాతకోతలు వీటన్నింటికీ ప్రభుత్వం ఖరారు చేసిన మొత్తాలను ఛలనా ద్వారా లబ్ధిదారులు చెల్లించి సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతించింది. ఈ మేరకు గ్రామ సచివాలయ సిబ్బందికి


పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న సచివాలయ సిబ్బంది


అవసరమైన శిక్షణను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇచ్చారు. ఈ మేరకు దుద్దేపూడి గ్రామ సచివాలయం ద్వారా ముగ్గురు రైతులు పూళ్ల సొసైటీ నుంచి వ్యవసాయ రుణం తీసుకునేందుకు తమ భూములను తనఖా పెట్టేందుకు రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాన్ని సంప్రదించారు. కార్యక్రమాన్ని చేపట్టిన సచివాలయ సిబ్బం దికి సహకరించినందుకు, రైతులకు గల సందేహాలను తీర్చేం దుకు భీమడోలు సబ్ రిజిస్టర్ శ్రీనివాసులు రంగప్రవేశం చేసి నియోజకవర్గ స్థాయిలో తొలిసారిగా నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేసినందుకు అవసరమైన సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా వట్టి వసంతకుమార్ జయంతి వేడుకలు

అభిమానుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి – భీమడోలు

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంత్రిగా పనిచేసిన వట్టి వసంతకుమార్ 70వ జయంతి కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా ఆయన అభిమానులు శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వట్టి వసంతకుమార్ భీమడోలు మండలంలోని ఎం.ఎం.పురం నివాసి. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. మంత్రిగా


భీమడోలులో...


ఉంగుటూరులో...

పనిచేశారు. 69 సంవత్సరాల వయసులో చనిపోయారు. శనివారం ఆయన జయంతి కార్యక్రమాల్లో భాగంగా తొలుత ఎం.ఎం.పురంలోని ఆయన నివాసం నుంచి మోటార్సైకిళ్ల ర్యాలీగా బయలుదేరిన అభిమానులు ఆయన సమాధి వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు.

ఉంగుటూరు :మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ కీర్తిశేషులు వట్టి వసంత్కుమార్ 70వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఉంగుటూరు మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక భవనంలో రక్తదాన శిబిరంలో 50 మందికి పైగా అభిమానులు రక్తదానం చేశారు. ఉంగుటూరుకు చెందిన పేద కళాకారుడు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చల్ల సూర్యారావు అనారోగ్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా వసంత కుమార్ అభిమానులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించారు .చేబ్రోలు, ఉంగుటూరు తదితర గ్రామాల్లో ప్రాథమిక కేంద్రాలు, సబ్ సెంటర్లలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మాజీ సభ్యులు కాటి కిరణ్కుమార్, మైలవరపు గోపాలకృష్ణ, మంద శ్రీనివాసరెడ్డి, కందెపు రవికుమార్, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి – నిడమర్రు

నిడమర్రు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శనివారం విపత్తు సంసిద్ధత గురించి చిలుకూరి రవి వివరించారు. విపత్తు వచ్చినపుడు ఏం చేయాలి, ఏం చేయకూడదో విద్యార్థులకు వివరించారు. వేసవి శిజ్ఞాన శిబిరంలో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 11వ తేదీతో ముగియనున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

భీమడోలు :పూళ్ల తోట వెంకటరామయ్య మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో గత 45 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం–2023 ముగింపు కార్యక్రమాన్ని గ్రంథపాలకులు డేగల అమరనాథ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. ప్రతిభ కనపరిచిన సదరు చిన్నారులకు పిఎంపి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.జయరామ్ రూ.వెయ్యి నగదు పురస్కారం అందించారు. మరొక దాత కల్లి అప్పారావు చిన్నారుల కాస్ట్యూమ్ కొనుగోలు కోసం రూ.రెండు వేలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుప్పాల హరీష్ పాల్గొని వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం కోసం రూ.నాలుగు వేలు, ఆట వస్తువుల కోసం రూ.ఐదు వేలు అందించారు. రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించిన గేదెల ఈశ్వరి ,కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన గ్రంథ పాలకులు డేగల


భీమడోలు : చిన్నారులను సత్కరిస్తున్న ప్రముఖులు, దాతలు

అమర్ నాథ్ లను స్థానికులు సత్కరించారు.. కార్యక్రమంలో మానవతా సంస్థ భీమడోలు చైర్మన్ , అధ్యక్షులు గుళ్ళ నూకరాజు ,,పచ్చా వెంకటేశ్వరరావు తో పాటు డి మంగయ్య, తోట పెదబాబు,, డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచి మాట తప్పిన జగన్

ప్రజాశక్తి – ఏలూరు

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, 200 యూనిట్లలోపు వినియోగించుకునే వారందరికీ ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన సిఎం జగన్ మాట తప్పారని, మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా అమలు చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విద్యుత్ విధానాలను మార్చుకోవాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడికి సిద్ధమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టేందుకు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలు రూపాల్లో రూ.20 వేల కోట్లకుపైగా విద్యుత్ భారాలను ప్రజలపై మోపారని, ఈ భారాలు బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ఏకమై జనంపై వేస్తున్నాయని పేర్కొన్నారు. జూన్లో వచ్చిన విద్యుత్ బిల్లులో వినయోగ ఛార్జీల కంటే మూడు రకాల సర్దుబాటు ఛార్జీలే ఎక్కువగా ఉన్నాయన్నారు. 2014 నుండి నేటి వరకూ వినియోగించుకున్న విద్యుత్కు ఆనాడే బిల్లులు కట్టినా, మళ్లీ వాటిపై ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. 2023 ఏప్రిల్ నుండి ప్రతినెలా విద్యుత్ ఛార్జీలను సవరించే కొత్త నిబంధనలను కేంద్రం ప్రవేశపెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా వాటిని అమలు చేస్తూ, సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.6000 కోట్లు ప్రజలపై భారాలు మోపారన్నారు.

విద్యుత్ కోతలను నివారించే పేరుతో మూడు రూపాయలకు కొనాల్సిన విద్యుత్తును రూ.10 నుండి రూ.20 వరకూ కొనుగోలు చేస్తున్నారని, ఇందులో పెద్దఎత్తున అవినీతి ఉందని, నాయకులు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. అదానీ, ఇతర కార్పొరేట్ల ప్రయోజనాల కోసం విద్యుత్ భారాలను జనంనెత్తిన వేస్తున్నారని, స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారీ కుంభకోణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడ్డాయని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్కు ఎసరు పెట్టటానికి వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారని, ప్రతిఇంటికీ, వ్యాపార సంస్థకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, ఈ కాంట్రాక్టులను ఆదానీ, ఇతర కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ కట్టబెట్టిందని విమర్శించారు. విద్యుత్రంగం మొత్తాన్ని ప్రయివేటు బడాకార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రం చట్ట సవరణ చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను, విద్యుత్ రంగ ప్రయోజనాలను ఫణంగా పెడుతుందని విమర్శించారు. ప్రజల సొమ్ముతో, విద్యుత్ ఉద్యోగుల శ్రమతో ఏర్పడిన ప్రభుత్వ విద్యుత్ సంస్థలను దెబ్బతీస్తున్నారని, నీరుగార్చుతున్నారని, విద్యుత్రంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలోని ప్రభుత్వాలు విద్యుత్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను సమీక్షిస్తామని మాట చెప్పిన ముఖ్యమంత్రి జగన్ ప్రయివేటు కంపెనీలతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేసే భారాల విషయంలో ప్రజలు మేల్కొనాలని, విద్యుత్ భారాలను తిప్పికొట్టాలని, కార్పొరేట్ అనుకూల సంస్కరణలను ఎదుర్కోవాలని, అందుకు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలను వెంటనే వీడాలని, ప్రజలపై విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులోనూ ప్రజలతో కలిసి మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

శస్త్రచికిత్సలో శిశువు తలకు కత్తిగాటు



ఏలూరు స్పోర్ట్స్:శస్త్ర చికిత్స సమయంలో అప్పుడే పుట్టిన పసికందుకు కత్తితో గాటు పెట్టారని, దీనిపై అడుగుతుంటే వైద్యులెవరూ తమ గోడును పట్టించుకోవడం లేదని ఆ పసికందు తండ్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ఎంసిహెచ్ బ్లాక్లో గర్భిణికి అత్యవసరంగా ఆపరేషన్ చేసి శిశువుకు జన్మనిచ్చారు. ఈ నేపథ్యంలో వైద్యుల నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేసి శిశువు తలపై కత్తిగాటు పెట్టారని తండ్రి ఆరోపిస్తున్నాడు. గర్భిణికి ఉమ్మనీరు లేకపోవడంతో ఆపరేషన్ చేసినా ఇబ్బంది అయిందనీ, చిన్నారికి ఎలాంటి ప్రమాదమూ లేదని, వైద్య చికిత్స అందించామని వైద్యులు చెబుతున్నారు. జంగారెడ్డిగూడేనికి చెందిన నాగదుర్గాంజలి నెలలు నిండటంతో ఏలూరు జిజిహెచ్లో మాతాశిశు కేంద్రానికి వచ్చి వైద్యులతో పరీక్ష చేయించుకుంది. ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఆసుపత్రికి రావడంతో వైద్యులు పరీక్షించి. అత్యవసరంగా పెద్దఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆమెకు ఉమ్మనీరు తక్కువగా ఉండడంతో సాధారణ ప్రసవం కావడం కష్టంగా ఉంటుందని భావించిన వైద్యులు ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 9.30 గంటల సమయంలో ఆమెకు శస్త్ర చికిత్స చేయడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారికి పాలు పట్టించాలని చెప్పటంతో శిశువును చూడగా తలపై గాయం అయినట్లు తండ్రి పవనకుమార్ గమనించాడు. ఈ విషయంపై సిబ్బందిని అడిగినా నిరక్ష్యంగా వ్యవహరించారని తండ్రి ఆరోపిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఏలూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెవివి.విజయకుమార్ వెంటనే పరిస్థితిని పరిశీలించారు. వైద్యులను ఆరా తీయగా ఉమ్మనీరు తక్కువగా ఉండడంతో ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీయటం కష్టంగా మారిందని. ఇదే సమయంలో చిన్నగాటు పడిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇవన్నీ ప్రసూతి, ఆపరేషన్ల సమయంలో ఒక్కోసారి పొరబాటున జరుగుతూ ఉంటాయనీ. ప్రస్తుతం శిశువు . ఆరోగ్యం బాగుందని చెప్పారు. చిన్నారి తలకు గాయం వద్ద మందు రాసి కట్టు కట్టారని, ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లల వైద్యులు పూర్తిగా పరీక్షించి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించారని తెలిపారు.

'ఉపాధి' అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి : వ్యకాస

ఏలూరు అర్బన్:ఉపాధి హామీ చట్టంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శనివారం సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎ.రాముకు వ్యవసాయ కార్మిక సంఘం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ఎంతో ప్రతిష్టాత్మకమైందని, కోట్లాదిమంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతుందని తెలిపారు. అలాంటి ఈ చట్టంలో నేడు అన్నిస్థాయిల్లోనూ అవినీతి కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మండలస్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అన్నిచోట్ల కూలీల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పెదవేగి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, లింగపాలెం, బుట్టయగూడెం, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో స్వయంగా మండలస్థాయి అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కనుసన్నల్లోనే కూలీల నుండి డబ్బులు వసూలు చేసే దందా జరుగుతుందన్నారు. ఈ మండలాల్లో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు ఇస్తేనే మస్తర్లు వేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకుండానే గ్రామ వాలంటీర్ల చేత అటెండెన్స్ వేయించడం చట్ట విరుద్ధమన్నారు. ఎపిఒ సమక్షంలోనే ఇలాంటి ఘటనలు ఎదురవుతున్నాయని తెలిపారు. పెదవేగి ఫీల్డ్ అసిస్టెంట్ను అన్యాయంగా స్థానిక రాజకీయ నాయకులు, ఎపిఒ, ఎంపిడిఒ అందరూ కలిసి సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. పెదవేగిలో యంత్రాలతో పని చేస్తుంటే దానికి ఎపిఒనే రాజకీయ నాయకులకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి అధికారుల వ్యవహారశైలి వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బుట్టాయిగూడెం మండలంలో జాబ్ కార్డు కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎపిఒ, అంతర్వేదిగూడెం, కోటనాగవరం పంచాయతీల్లో రూ.వంద నుండి రూ.150 వరకూ కూలీల నుండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పంచాయతీల్లో ఒకపక్క యంత్రాలతో పనిచేస్తూ మరో పక్క ఉపాధి పని చూపించడం వల్ల కూలీలకు తీవ్ర నష్టం జరుగుతు ందన్నారు. కూలీలకు వేతనాలు రెండు నుండి నాలుగు వారాల పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి, చక్రదేవరపల్లి, నాగులగూడెం, ఎ.పోలవరం పంచాయతీలో ఎపిఒ సమక్షంలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై దర్యాప్తు జరపాలని ఇలాంటి ఎపిఒలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా మస్తర్ షీట్ల కోసం ఎపిఒలు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో అనేక మండలాల్లో, గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటన సందర్భంలో కూలీలు పడుతున్న సమస్యలను తమ బృందం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం పీడీ ఎ.రాము స్పందిస్తూ జిల్లాలో అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్న ఎపిఒలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరుపుతామన్నారు. నిజనిర్ధారణ జరిగితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్ల్యాండ్ ప్రాంతంలో కొన్ని గ్రామాల్లో కూలీలు బాగా పనిచేస్తున్నారని, వారికి ఏలాంటి ఇబ్బందులు వచ్చినా డ్వామా సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. డ్వామా సంస్థ ద్వారా ప్రతికూలీకి వేతనం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ పాల్గొన్నారు.

12న మర్రిబంధంలో గ్రామసభ

నూజివీడు రూరల్:మండలంలోని మరిబందం గ్రామంలో ఈ నెల 12న భూ యాజమాన్య హక్కు పత్రాల పరిశీలన, అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డివిఎస్.ఎల్లారావు తెలిపారు.

శ్రీవారి స్వర్ణమయ విమాన గోపురం పథకానికి విరాళం

ద్వారకాతిరుమల:ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణమయ విమాన గోపురం పథకానికి హైదరాబాద్కు చెందిన వివిఎస్ఎల్ఎన్.కార్తీక్ శనివారం ఉదయం రూ.లక్ష విరాళాన్ని దేవస్థానం వారికి చెక్ రూపంలో అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్ అందించారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుక

ముసునూరు:నటవారసత్వం ఆంది పుచ్చుకున్న అందరి అభిమాన హీరో, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ అని తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో గ్రంథాలయం వద్ద నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి ఉపాధ్యక్షులు కొల్లి గంగారామ్, మందలపు ధర్మారాజు, కాట్రేనిపాడు గ్రామంలో సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సోంగా ఇస్సాక్, ముసునూరులో పాకనాటి సీతారామ్, రెడ్డి కృష్ణ, తోట శ్రీను, కోండేటి బాబి, పాకనాటి ఆంజనేయులు, గోగం కాసులు, చింతా రాంబాబు, వలసపల్లిలో మెదరమెట్ల సురేంద్ర, అక్కిరెడ్డిగూడెంలో సర్పంచి పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, బస్వావరప్పాడులో వేంపాటి సత్యనారాయణ, చెక్కపల్లిలో కూచిపూడి దేవేంద్ర, కాటేపల్లి సత్యనారాయణ, సర్పంచి రాధిక సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చింతలపూడి : సినీరంగంలో, రాజకీయాల్లో నందమూరి బాలకృష్ణ రాణిస్తున్నారని చింతలపూడి జూనియర్ ఎన్టిఆర్ ఫ్యాన్స్ మండల అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు బాలకష్ణ అన్నారు. పట్టణంలో ఎన్టిఆర్.విగ్రహం వద్ద బాలకృష్ణ పుట్టినరోడు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

ఐఎఫ్టియు నగర అధ్యక్షునికి ప్రమాదం

ఏలూరు అర్బన్:ఐఎఫ్టియు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావుకు శనివారం ప్రమాదం జరిగింది. కొబ్బరితోటలోని తన ఇంటి వద్ద నుండి బిఎస్ఎన్ఎల్ రోడ్డులోని ఐఎఫ్టియు కార్యాలయానికి సైకిల్పై వస్తుండగా ఏలూరు జ్యూట్ మిల్లు సెంటర్లో వెనక నుండి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కుడికాలు మీదుగా లారీ ముందు వెళ్లడంతో కుడికాలు పాదం బాగా దెబ్బతినింది. ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంనిమిత్తం ఏలూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

సూరప్పగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

భీమడోలు:ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో శనివారంతో 166వ రోజుకు చేరుకుంది. సూరప్పగూడెంలో ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నాయనే విషయమై ఆరా తీశారు. అర్హులందరికీ పూర్తిస్థాయిలో పథకాల లబ్ధి చేకూరుతుందని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామస్తులు విద్యుత్ కోతల సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెజ్జు బాలాజీ నాయుడు, ఎంపిటిసి ఇంజేటి జూనియర్, ఎఎంసి ఛైర్పర్సన్ ఐ.నీలిమ జూనియర్, భీమడోలు ఎంపిడిఒ పద్మావతిదేవితో పాటు పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

మహికి ఐటిడిపి పురస్కారం

జంగారెడ్డిగూడెం :మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన పొన్నగంటి మహి టిడిపి అధినేత నారా చంద్రబాబు ద్వారా పురస్కారం అందుకున్నారు. శనివారం పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐటిడిపి ప్రధాన కార్యదర్శి పొన్నగంటి మహి విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం అందుకున్నారని తెలిపారు.

రాయితీపై విత్తనాలు

ముదినేపల్లి :రైతులు ఖరీఫ్లో ఆపరాల సాగు చేసేందుకు విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామన్నారు. 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నామన్నారు. జీలుగవిత్తనాలు పది కేజీల బ్యాగ్ ధర రూ.79 కాగా, 50 శాతం రాయితీపోనూ రూ.39.50కు ఇస్తున్నామన్నారు. సన్హెంప్ విత్తన బ్యాగ్ 10 కేజీల పూర్తి ధర రూ.84 కాగా 50 శాతం రాయితీ పోనూ రూ.42 చెల్లించాలన్నారు. పిల్లి పెసర విత్తన బ్యాగ్ ఎనిమిది కేజీల ధర రూ.97 కాగా 50 శాతం రాయితీపై రూ.48–50కి అందిస్తున్నట్లు చెప్పారు.